క్లుప్తంగా

'బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ' సభకు తరలిరండి

● జెడ్పీ చైర్‌పర్సన్ విజయ



కవిటి: బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ పేరిట రెండో దశలో కవిటిలో ఈ నెల ఆరో తేదీ చేపడుతున్న సమావేశానికి ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలని జెడ్పీ చైర్‌పర్సన్, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పిరియా విజయ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆరో తేదీ ఉదయం తొమ్మిది గంటలకు కవిటిలో అగ్నికులక్షత్రియ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి శ్రీకాకుళం పార్లమెంటరీ పార్టీ పరిశీలకులు కుంభా రవిబాబు, జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ ముఖ్యఅతిథులుగా పాల్గొంటున్నారన్నారు. చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తీసుకురావడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్టు పేర్కొన్నారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ, నాలుగు మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ స్థానిక సంస్థల బాధ్యులు, పార్టీ బాధ్యులు, క్రియాశీల కార్యకర్తలు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

2 నెలల తరువాత చెత్తను తొలగించారు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో పేరుకుపోయిన చెత్త తొలగించాలంటే రెండు నెలలు సమయం తీసుకుంటున్నారని.. ఇదేనా కూటమి ప్రభుత్వం స్పందన అని 19వార్డు కౌన్సలర్ శిష్టు బృంధావతి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు శిష్టు గోపి ప్రశ్నించారు. సూది కొండ ప్రాంతంలో మున్సిపల్ జేసీబీతో శుక్రవారం చెత్తను తొలగించిన సందర్భంగా వారు మాట్లాడారు. చెత్తను తొలగించాలని కోరుతూ మున్సిపల్ చైర్మన్‌కు ఫిర్యాదు చేస్తే పార్టీలను చూసి పనులు చేస్తున్నారన్నారు. దీంతో జిల్లా కలెక్టర్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశామని చెప్పారు. అయితే అప్పటికీ మున్సిపాలిటీ నుంచి చేసినట్లు కమిషనర్ నడిపేన రామారావు తప్పుడు జవాబు పంపించారన్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ కార్యాలయం అధికారుల నుంచి మరోసారి ఫోన్‌కాల్ రావడంతో సమస్య వివరించగా ఎట్టకేలకు చెత్తను తొలగించారని అన్నారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

కంచిలి: ఆధార్ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వి.తిరుమలరావు కోరారు. మకరాంపురం సచివాలయంలో కొత్తగా కేటాయించిన ఆధార్ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. స్థానిక ప్రతినిధులు తమరాల శోభన్‌బాబు, టి.వి.రమణ, టి.కృష్ణారావు, వీఆర్వో హర్ష, పంచాయతీ కార్యదర్శి తులసీరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రిటైర్డు కెప్టెన్‌కు ఘన స్వాగతం



సోమేశ్వరరావుకు స్వాగతం పలుకుతున్న ఆర్మీ రిటైర్డు ఉద్యోగ సంఘం ప్రతినిధులు

కంచిలి: మండలంలోని ఎర్రముక్కాం గ్రామానికి చెందిన పొట్టి సోమేశ్వరరావు ఇండియన్ ఆర్మీలో వివిధ హోదాల్లో 30 ఏళ్ల సేవలందించి ఇటీవల కెప్టెన్ హోదాలో ఉద్యోగ విరమణ చేశారు. ఈయన ఉత్తరప్రదేశ్ మీరట్ ఆర్‌వీసీ సెంటర్ అండ్ కాలేజీ ఆవరణలో ఆర్మీ ఉన్నతాధికారులు చేతులమీదుగా సన్మానించబడి శుక్రవారం ఎర్రముక్కాం స్వగ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా సోంపేట రైల్వేస్టేషన్‌లో కంచిలి, సోంపేట మండలాల మాజీ సైనిక ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు పైల మన్మథరావు ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈసందర్భంగా సోమేశ్వరరావు తిరుపతమ్మ దంపతులను ఘనంగా సన్మానించారు. 1995 లో సైనికునిగా ఆర్మీలో చేరిన సోమేశ్వరరావు జమ్మూకశ్మీర్, ఉత్తరాఖండ్, అసోం, ఢిల్లీ తదితర ప్రాంతాల్లో సేవలంఅందించారు. ఆర్మీలో ఉంటూ తన సొంతూరు అభివృద్ధికి కూడా తన వంతు సాయం అందించేవారు. స్వాగతం పలికిన వారిలో ఆర్మీ రిటైర్డు ఉద్యోగుల యూనియన్ ప్రతినిధులు డొక్కరి భోగయ్య, క్రిష్ణారావు, పాపారావు, ప్రసాద్, అప్పలస్వామి, ఈశ్వరరావు, పితాంబర్ ప్రధాన్, చిరంజీవి, నూకయ్య, లోకనాథం ఉన్నారు.

పూర్తిస్థాయిలో విద్యార్థి కిట్లను అందించాలి

నందిగాం: పాఠశాలల్లో విద్యార్థుల నమోదు ప్రాప్తికి సరిపడా విద్యార్థి కిట్లను అందించాలని యూటీఎఫ్ నందిగాం మండలశాఖ సభ్యులు కోరారు. ఈ మేరకు పాఠశాలల్లో సమస్యలు, వాటి పరిష్కారానికి స్థానిక వనరుల కేంద్రంలో ఎంఈవో జి.నర్సింహులుకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూటీఎఫ్ జిల్లా సెక్రటరీ బాలక శంకరరావు, నందిగాం శాఖ అధ్యక్షుడు కె.కుమారస్వామి, జనరల్ సెక్రటరీ వై.గణపతిరావు, కార్యదర్శులు కె.సురేష్‌కుమార్, ఎస్.శివ ప్రసాద్ ఉన్నారు.

మాజీ కౌన్సిలర్ మృతికి సంతాపం

కాశీబుగ్గ: మాజీ కౌన్సిలర్ దేవ లక్ష్మణమూర్తి మృతి తీరని లోటని పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, పలాస పీఏసీఎస్ పూర్వ అధ్యక్షులు దువ్వాడ శ్రీధర్ (బాబా), మున్సిపల్ వైస్ చైర్మన్ మీసాల సురేష్ అన్నారు. లక్ష్మణమూర్తి కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించి సంతాపం తెలియజేశారు.

● అడుక్కో మడుగు..గజానికో గొయ్యి
● అవస్థలు పడుతున్న వాహన చోదకులు

శిథిలమైన పల్లె రోడ్లు!



గోతులతో దర్శనమిస్తున్న మేఘమాల బస్‌స్టాండ్ రోడ్డు



శిథిలమైన చీపి ప్రధాన రహదారి

మందస:

వర్షాలు పూర్తిస్థాయిలో కురవకముందే ప్రజలకు రహదారి కష్టాలు వెంటాడుతున్నాయి. కొద్దిరోజులుగా మోస్తరుగా కురుస్తున్న వర్షాలకు గ్రామీణ రోడ్లు శిథిలమై నరకానికి నకళ్లుగా మారుతున్నాయి. మందస మండలంలో చాలా గ్రామీణ రోడ్లు శిథిలమై దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా మేఘమాల నుంచి సుమారు 40 గ్రామాలను కలిపే చీపి రోడ్డు అడుక్కో మడుగు, గజానికో గొయ్యితో దర్శనమిస్తోంది. కొద్దిపాటి వర్షానికే గోతుల్లో నీరు చేరుతుండడంతో వాహన చోదకులు నరకయాతన పడుతున్నారు. మేఘమాల నుంచి పద్మపురం వరకు ఉన్న రోడ్డు పూరితగా రాళ్లు తేలిపోయి, గోతులతో దర్శనమిస్తోంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణం చేయాలంటే జనం భయాందోళన చెందుతున్నారు. ఈ మార్గంలో నిత్యం వాహనాల రాకపోకలు చేస్తుంటాయి. అయితే ప్రస్తుతం రోడ్డు అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రయాణం చేయాలంటే నరకాన్ని చూస్తున్నామని జనం బెంబేలెత్తిపోతున్నారు. చీపి, ఉదయరామచంద్రపురం, కొరడాబడి, మురదమేకో, చంపపురం, నారాయణపురం, పంకలబడ, బేతుకోల, పద్మపురం, జేన్నాసాయి, సవర తులసిగాం తదితర సుమారు 40 గ్రామాలు మందస కేంద్రానికి వెళ్లేందుకు ప్రధాన మార్గం ఇదే కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. అయితే ప్రాంతం రిజర్వు ఫారెస్ట్ ఏరియా కావడంతో కొండలపై నుంచి వర్షం నీరు రోడ్డుపైకి వస్తుండడంతో తరుచూ పాడవుతోంది. అస్తవస్తంగా ఉన్న రోడ్లను బాగు చేయించాలని ప్రజలు అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..అనుమతులు వచ్చి నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తామంటున్నారని స్థానికులు అంటున్నారు.

కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదు



కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కనీసం రోడ్లను పట్టించుకోవడం లేదు. అధ్వాన రోడ్లతో అవస్థలు పడుతున్నాం. రోడ్లకు కనీసం మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారులకు విన్నవించాం. బిల్లు పెట్టి ఉన్నామని.. వచ్చిన తరువాత పనులు పూర్తి చేస్తామని అంటున్నారు.

–సవర రాణి, మేఘమాల

భయంగా ఉంటుంది..



మేఘమాల నుంచి మందస వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే భయంగా ఉంటుంది. ప్రైవేట్ స్కూల్ బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు, వ్యాన్‌లు నిత్యం తిరుగుతుంటాయి. అయితే రోడ్డు పాడవ్వడంతో ప్రయాణం నరకంగా ఉంది. అధికారులు చర్య తీసుకొని రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.

–తామాడ వల్లభరావు, మేఘమాల, మందస మండలం

శక్తి యాప్‌పై అవగాహన



మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని సోంపేట సీఐ బి.మంగరాజు అన్నారు. సోంపేటలోని సంస్కార భారతి డిగ్రీ కళాశాల విద్యార్థినులకు శక్తి యాప్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినులు, మహిళలు, చిన్నారుల భద్రత, రక్షణ కోసం పోలీస్ శాఖ శక్తి యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. అనంతరం సైబర్ క్రైమ్, గృహహింస, బెట్టింగ్ యాప్, యాంటీ డ్రగ్స్, హెల్మెట్ లేని ప్రయాణం వలన కలుగు నష్టాలను వివరించారు. ఎస్సై వి.లోవరాజు, చైర్మన్ ఎన్ని దేవరాజు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

–సోంపేట

సమస్యలు పరిష్కరించాలి



ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టెక్కలి డిపో ఎదుట ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. పదోన్నతులు కల్పించాలని, ప్రభుత్వమే ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేసి ఆర్టీసీ ఉద్యోగులతో నడిపించాలని, 11వ వేతన పీఆర్సీ బకాయిలు చెల్లించాలని, ఎన్నికల మునుపు ఇచ్చిన హామీల మేరకు 12వ పీఆర్సీ ప్రకటించాలని, ఉద్యోగ విరమణ చేసిన వారికి బకాయిలు చెల్లించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో రీజనల్ సంయుక్త కార్యదర్శి బడే మురళి, ప్రతినిధులు ఎస్.మోహన్‌రావు, సీహెచ్ శ్రీను, మూర్తి, పాపారావు పాల్గొన్నారు.

–టెక్కలి

స్వామి వివేకానందునికి నివాళులు



స్వామి వివాకానందుడు ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు అన్నారు. ఇచ్ఛాపురం పట్టణంలో స్వామి వివేకానందుని వర్ధంతి కార్యక్రమాన్ని నైమిషారణ్య పీఠం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. బస్టాండ్ కూడలిలోని వివేకానందుని విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. నైమిషారణ్య పీఠం అధ్యక్షులు, హిందూధార్మిక సంఘం వ్యవస్థాపకులు బాలబ్రహ్మానంద సరస్వతి, దక్కత కృష్ణమూర్తిరెడ్డి, ఉలాసి యర్రయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

–ఇచ్ఛాపురం

ప్రజలను దగా చేయడమే 'తొలిఅడుగు'



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్

● ఎమ్మెల్సీ రామారావు, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్

కంచిలి: కూటమి ప్రభుత్వం ఏడాది సుపరిపాలనలో ప్రజలను దగా చేయడమే తొలిఅడుగు వేశారని ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ విమర్శించారు. కంచిలిలోని ఎమ్మెల్సీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం సాయంత్రం మండల పార్టీ నేతలతో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజలకు ఏం చేశారని ఇంటింటికీ వెళ్లి టీడీపీ నేతలు కలుస్తున్నారని ప్రశ్నించారు. ఒక్క ఉచిత గ్యాస్ సిలిండర్ తప్ప ఇంకేం చేశారని ప్రజలు ముందుకు వెళుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏం చేసిందో, అంతకుముందు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏడాది పాలనలో ఎన్ని పథకాలు అమలు చేశామో చెప్పడానికి వైఎస్సార్‌సీపీ వెళ్తుందని ఈ సందర్భంగా వెల్లడించారు. 'రీ కాలింగ్ చంద్రబాబు మ్యానిఫేస్టో (చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ..)' కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ తరపున విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. ఇందుకోసం కవిటి మండల కేంద్రంలోని అగ్నికుల క్షత్రియ సంఘ భవనంలో ఈ నెల ఆరో తేదీ ఉదయం తొమ్మిది గంటలకు నియోజకవర్గస్థాయి పార్టీ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశానికి పార్టీ పార్లమెంటు పరిశీలకులు కుంభా రవిబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ విచ్చేస్తారన్నారు. ఈ సమావేశంలో రెండో విడత 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'పేరుతో 'రీ కాలింగ్ చంద్రబాబు మ్యానిఫేస్టో కార్యక్రమ నిర్వహణపై సమావేశంలో చర్చిస్తామన్నారు. సమావేశానికి నియోజకవర్గ పరిధిలో ఉన్న మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ క్యాడర్ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు లద్దు కేశవపాత్రో, మండల జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్, మండల పార్టీ కార్యదర్శి మద్దు వెంకటరావు, డొక్కరి బలరాం, పలికల జయరాం, లింగం కేశవరావు, మద్దు అభియాదవ్ పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడేషన్

వజ్రపుకొత్తూరు: అనంతగిరి ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడేషన్ చేస్తూ పాఠశాల విద్యాశాఖ రీజనల్ జాయింట్ (విశాఖపట్నం) డైరెక్టర్ బి.విజయభాస్కర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉన్నత పాఠశాలకు చదువుకునేందుకు విద్యార్థులు ఏడు కిలో మీటర్లు దూరంలోని పలాస మండలం బ్రాహ్మణతర్లా, లేదా ఐదు కిలో మీటర్ల దూరంలోని నందిగాం మండలం పెద్దబాణాపురం వెళ్లాల్సి వచ్చేది. ఈ విషయాన్ని గ్రామస్తులు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టికి తీసుకెళ్లడంతో సమస్య పరిష్కరించారు. తొమ్మిదో తరగతిని ఈ ఏడాది నుంచి పాఠశాలలో అమలు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పెంపుడు కుక్కలకు వ్యాక్సినేషన్ రేపు

కాశీబుగ్గ: ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల ఆరో తేదీన పలాస ప్రాంతీయ పశువైద్యశాల ఆవరణలో పెంపుడు కుక్కలకు రేబీస్ వ్యాధి సోకకుండా ఉచితంగా టీకాలు వేయనున్నట్టు పశువైద్యశాఖ సహాయ సంచాలకు డాక్టర్ మట్ట రవికుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. కుక్కలు, ఇతన జంతువులను పెంచుకుంటున్న వాటి యజమానులు ఈ అవకాశాలన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● ఘనంగా అల్లూరి జయంతి



టెక్కలిలో బీజేపీ ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో అల్లూరికి నివాళులర్పిస్తున్న దృశ్యం



కవిటి: పెద్ద ఎర్రగోవిందపుట్టుగలో నివాళులర్పిస్తున్న చిన్నారులు



కంచిలి: బూరగాంలో అల్లూరి జయంతిలో గ్రామస్తులు

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని పాఠశాలలు, కళాశాలలు, పలు స్వచ్ఛంద సంస్థల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోరాట పటిమను వక్తలు గుర్తు చేసుకున్నారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున గెరెల్లా పోరాటం చేసి గడగడలాడించిన మహావీరుడు సీతారామరాజుని కొనియాడారు. ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలల్లో చిన్నారులు అల్లూరి వేషధారణలో అలరించారు.

–సాక్షి నెట్‌వర్క్

ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం


● పార్టీ శ్రేణులకు తిలక్ పిలుపు



జిల్లా కమిటీ సభ్యులను సత్కరిస్తున్న తిలక్, వసంతరెడ్డి

సంతబొమ్మాళి: బాబు ష్యూరిటీ అని ప్రజలను ఎన్నికలకు ముందు నమ్మించి నేడు మోసగించిన తీరును ప్రజల్లోకి తీసుకెళ్లడానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు కృషి చేయాలని పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ కోరారు. హెచ్.ఎస్.పేటలోని పార్టీ కార్యాలయంలో నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు దిట్టని, మరోసారి ప్రజలను మోసగించారని అన్నారు. ఎన్నికలకు ముందు 143 హామీలు ఇచ్చి ఒక్కదాన్ని కూడా నెరవేర్చలేదని అన్నారు. సూపర్‌సిక్స్ అని చెప్పి ప్రజలను డక్ అవుట్ చేశారని విమర్శించారు. తల్లికి వందనమని చెప్పి 25 వేల మంది తల్లులకు నగదు జమ చేయకుండా అన్యాయం చేశారని అన్నారు. ఎన్నికలకు ముందు అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఒకేసారి రూ. 20 వేలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత మూడు విడతలుగా ఇస్తామని చెప్పడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం అరాచకాలతో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు రావడానికి భయపడుతున్నారని అన్నారు. బాబు ష్యూరిటీ మోసం-గ్యారంటీ పేరిట కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో పేరిట ఇంటింటా ప్రచార కార్యక్రమంపై వివరించారు. కింజరాపు కుటుంబీకులు ఈ ప్రాంతానికి చేసిన అభివృద్ధి శూన్యమని అన్నారు. అనంతరం పార్టీ జిల్లా కమి టీకి ఎన్నికైన నక్క భీమారావు, ఎన్ని మన్మథరావు, మార్పు అశోక్ చక్రవర్తిలను దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బి.మోహన్‌రెడ్డి, నాయకులు సుగ్గు రామిరెడ్డి, జోగి రాములమ్మ, ఆర్.రాంరెడ్డి, అంగ జనార్దన్, జీరు బాబూరావు, మార్పు నాగభూషణరావు, బి. సుధాకర్, పాల మహేష్‌రెడ్డి, టి.నారాయణ, పంగ రామయ్య, అంగ మల్లేషు, అంగ అప్పారావు, జి. చంద్రరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

'ఓట్లు వేసిన ప్రజలను మోసం చేశారు'



నందిగాంలో మాట్లాడుతున్న తిలక్

నందిగాం:

నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు చంద్రబాబు మోసం చేశారని వైఎస్సార్ సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేరాడ తిలక్ అన్నారు. ఆ మోసాన్ని ప్రజలకు అర్థమయ్యేలా పార్టీ శ్రేణులు వివరించాలని కోరారు. టెక్కలిలోని పార్టీ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఈ నెలలో నిర్వహించవలసిన వివిధ కార్యక్రమాలు విజయవంతమయ్యేలా చూడాలని కోరారు. ఎనిమిదో తేదీన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమాన్ని మండలంలో ఘనంగా నిర్వహించాలని కోరారు. 12న టెక్కలి ఆదిత్య కళ్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించనున్న పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో, 15న మండల స్థాయిలో నిర్వహించనున్న సమావేశంలో పార్టీ శ్రేణులు పాల్గొనేలా చేయాలని కోరారు. ఈ నెల 21 నుంచి వచ్చే నెల నాలుగో తేదీ వరకు గ్రామాల్లో పర్యటించి చంద్రబాబు ఎన్నికల ముందు తన సంతకంతో ప్రతి కుటుంబానికి ఇచ్చిన హామీ పత్రాన్ని క్యూఆర్ కోడ్‌తో ఉన్న కరపత్రం ద్వారా ప్రతి కుటుంబానికి వివరించాలని, ఏ సంక్షేమ పథకం అందజేయకుండా చంద్రబాబు ప్రజలకు చేసిన మోసాలను వివరించాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కురమాన బాలక్రిష్ణారావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగపు కార్యదర్శి యర్ర చక్రవర్తి, యువజన అధ్యక్షులు చిన్ని జోగారావు, మండల అధ్యక్షుడు తమిరె ఫాల్గుణరావు, అక్రుఆడ లోకనాథం, జద్యాడ జయరాం, సర్లాన బైరాగి, అంబోడి విష్ణు పాల్గొన్నారు.

99 విద్యుత్ మీటర్లు ఉన్నాయని

'తల్లికి వందనం' రాలేదు



తల్లికి వందనం వర్తించలేదంటున్న లక్ష్మి

టెక్కలి: ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు లావేటి లక్ష్మి. ఈమె తన భర్త చందు, ఇద్దరు పిల్లలతో కలిసి పలాస సూదికొండ ప్రాంతంలో నివసిస్తున్నారు. భార్య భర్తలిద్దరూ అక్కడే ఓ జీడి పరిశ్రమలో కార్మికులుగా పనిచేస్తున్నారు. సొంత ఇల్లు లేకపోవడంతో పరిశ్రమ యజమాని తనకు చెందిన ఇంటిని తలదాచుకోవడానికి ఇచ్చారు. కుమారుడు పలాసలో ప్రభుత్వ పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్నాడు. అయితే ఇటీవల ప్రభుత్వం అమలు చేసిన తల్లికి వందనం పథకం డబ్బులు ఖాతాలోకి పడలేదు. తనకు తల్లికి వందనం ఎందు రాలేదని సచివాలయం వద్దకు వెళ్లి వాకబు చేయగా ఆమె టెక్కలిలోని తాతగారి రేషన్ కార్డులో మ్యాపింగ్ జరిగిందని సచివాలయం అధికారులు చెప్పడంతో, టెక్కలిలో గ్రామ సచివాలయం-5 కార్యాలయానికి వెళ్లి సిబ్బందికి విన్నవించగా వారు చెప్పిన సమాధానానికి ఆమెతో పాటు భర్త ఒక్క సారిగా కంగుతిన్నారు. లావేటి లక్ష్మి పేరుతో ఏకంగా 99 విద్యుత్ మీటర్లు ఉండడమే కాకుండా ఏడాదిగా 5 వేల యూనిట్లు విద్యుత్ వినియోగించినట్లు ఆన్‌లైన్‌లో చూపించింది.

సొంత ఇల్లు లేని తమకు 99 మీటర్లు ఎలా వచ్చాయో అర్థం కావడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కోసం నెల రోజుల నుంచి సచివాలయం, విద్యుత్ శాఖాధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదని బాధితురాలు లక్ష్మీతో పాటు భర్త చందు వాపోయారు. శుక్రవారం టెక్కలిలో మంత్రి అచ్చెన్నాయుడును కలిసేందుకు వచ్చి సమస్యను విన్నవించినప్పటికీ నిరాశే కలిగింది. తన సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

పిల్లలంతా బడిలో చేరాలి

కవిటి: బడిఈడు వచ్చిన పిల్లలు విధిగా ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ విస్తృత ప్రచారం చేయాలని శ్రీకాకుళం జిల్లా సమగ్ర శిక్షా ప్రత్యామ్నాయ పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ కింజరాపు రామకృష్ణ అన్నారు. ముత్యాలపేటలోని జెడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం సందర్శించారు. ఎన్రోల్మెంట్ డ్రైవ్ కోసం ఉపాధ్యాయులతో చర్చించారు. మోడల్ ప్రైమరీ పాఠశాలలు బలోపేతం చేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు.

ముగిసిన మహిళా సర్పంచుల శిక్షణ

పలాస: పలాస మండల పరిషత్ కార్యాలయంలో పలాస, నందిగాం, మెళియాపుట్టి మండలాల మహిళా సర్పంచులకు మహిళా సాధికారితపై అవగాహన కల్పించుటకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా పలాస ఎంపీడీవో కె.వసంతకుమార్ మాట్లాడుతూ.. పలాస డివిజన్‌లోని మహిళ సర్పంచులకు ఒక్కో నియోజకవర్గానికి మూడు రోజులు పాటు శిక్షణ ఇస్తున్నామన్నారు. పంచాయతీల్లో పాలన ఎలా జరపాలి, ఎవరితో ఎలా ఉండాలి, అభివృద్ధి ఎలా సాధించాలో శిక్షణ ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రతి విషయాన్ని అవగాహన చేసుకొని పాలన చేయాలన్నారు. డీఆర్పీలు జ్యోతి, శ్రీనివాస్, కామరాజు, ఎన్.మన్మథరావు సర్పంచులకు శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మెట్ట వైకుంఠరావు, ఈవో అనురాధ, సీనియర్ అసిస్టెంటు మన్మథరావు, డీపీఆర్సీ కోఆర్డినేటర్ పేరాడ ఆనందరావు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సీట్లు కేటాయించాలని వినతి



ఏబీసీడబ్ల్యూవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న విద్యార్థినులు

టెక్కలి: డివిజన్ కేంద్రమైన టెక్కలిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరిన విద్యార్థినులకు తక్షణమే సీట్లు కేటాయించాలని నిరుద్యోగ పోరాట సమితి నాయకుడు టి.సూర్యం కోరారు. ఈ మేరకు టెక్కలి ఏబీసీ డబ్ల్యూఓ త్రినాథరావుకు విద్యార్థినులతో కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుదూర ప్రాంతాలకు చెందిన విద్యార్థినులు కళాశాలల్లో చేరినప్పటికీ వారికి వసతి గృహాల్లో సీట్లు ఇవ్వకుండా తాత్సారం చేస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా బీసీ బాలికల వసతి గృహంలో సీట్లు కోసం దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నప్పటికీ అధికారులు కనీసం స్పందించడం లేదన్నారు. తక్షణమే వసతి గృహాల్లో బాలికలకు సీట్లు మంజూరు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సోనియా, జ్యోత్స్న, రజిత ఉన్నారు.